andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
శనివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 35.9 కనిష్ఠం 23.3



5న జిల్లా స్థాయి సైన్స్ ప్రదర్శన : డీఈవో

నిర్మల్ కల్చరల్, మార్చి 2 : ఈ నెల 5న ఈద్గామ్‌లోని ప్రభుత్వ బాలికల ఆశ్రమ పాఠశాలలో కలెక్టర్ ఆదేశం మేరకు సైన్స్‌ఫెయిర్ నిర్వహిస్తున్నట్లు డీఈవో రవీందర్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన పాఠశాలలో ఏర్పాట్లను పరిశీలించారు. భేటీబచావో - భేటీపడావో కార్యక్రమంలో భాగంగా సైన్స్‌ఫెయిర్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. సుస్థిర అభివృద్ధి కోసం సైన్స్ అండ్ టెక్నాలజీ అనే ప్రధాన అంశంతో పాటు 5 ఉప అంశాలపై ప్రదర్శన ఉంటుందన్నారు. జూనియర్, సీనియర్ విభాగాల్లో 6, 7, 8, 9 తరగతుల విద్యార్థులు పాల్గొనాలన్నారు. 4లోగా రిజిస్టర్ చేసుకోవాలన్నారు. వివరాలకు 9440069830 నంబరును సంప్రదించాలని సూచించారు. జిల్లా సైన్స్ అధికారి వినోద్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

డి-1 అక్రమాలపై పూర్తయిన విచారణ



అక్రమ డి-1 పట్టా భూముల వివరాలను వెల్లడిస్తున్న ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి (ఫైల్)



- జిల్లాలో దాదాపు 2వేల ఎకరాలు స్వాహా
- అప్పటి అధికార పార్టీ నేతలే అసలు సూత్రధారులు
- సంబంధిత శాఖ అధికారులు, సిబ్బందిపైనా ఆరోపణలు
- ఈ దిశగానే చర్యలకు సిద్ధమవుతున్న కలెక్టర్
- చర్యలు తీసుకోవాల్సిందేనంటూ స్పష్టం చేసిన ఎమ్మెల్యే

నిర్మల్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో 2014 సంవత్సరం నుంచి 2018 సంవత్సరం వరకు యథేచ్ఛగా సాగిన నకిలీ డి-1 పట్టాల వ్యవహారంపై ఎట్టకేలకు కలెక్టర్ తన విచారణను పూర్తి చేసి దానికి సంబంధించిన నివేదికలను సర్కారుకు అందించినట్లు విశ్వసనీయ సమాచారం. గత కొద్దిరోజుల నుంచి ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి డి-1 పట్టాల వ్యవహారంలో జరిగిన భారీ అక్రమాలపై అటు ప్రభుత్వానికి ఇటు కలెక్టర్‌కు స్వయంగా ఫిర్యాదు చేయడమే కాకుండా విచారణ జరిపి చర్యలు తీసుకోవాలంటూ పట్టుబడుతున్నారు. అప్పటి అధికార పార్టీ ప్రజా ప్రతినిధులు, వారి బంధువులు సంబంధిత సర్వేల్యాండ్ డిపార్ట్‌మెంట్‌లోని ఓ అధికారితో పాటు కొంతమంది సిబ్బందిని మచ్చిక చేసుకొని పెద్దఎత్తున భూ కుంభకోణాలకు పాల్పడినట్లు ఫిర్యాదులున్నాయి. ముఖ్యంగా నిర్మల్ జిల్లాలో భూముల ధరలకు రెక్కలు రావడంతో అప్పటి అధికార పార్టీ నేతలంతా ఇటు వైపు కన్ను వేశారన్న విమర్శలున్నాయి. ఎస్సారెస్పీ ప్రాజెక్ట్ నిర్వాసితులకు కేటాయించే డి-1 పట్టాలపై వీరంతా దృష్టి కేంద్రీకరించి ఆ పట్టాల పేరిట ప్రభుత్వ భూములను కొల్లగొట్టేందుకు ఎత్తుగడలు వేశారు. నిబంధనల ప్రకారం డి-1 పట్టాల జారీ కాలపరిమితి ఎప్పుడో ముగిసినప్పటికి సదరు అక్రమార్కులు మాత్రం 2016 సంవత్సరం నుంచి 2018 సంవత్సరం వరకు నకిలీ పట్టాలను సృష్టించి ఆ పట్టాలకు సేత్వారీలు కూడా తయారు చేయించుకున్నట్లు ఆరోపణలున్నాయి. నకిలీ డి -1 పట్టాలతో కొంతమంది అధికారులు రికార్డులను తారుమారు చేసి సేత్వారీలను రూపొందించడమే కాకుండా విలువైన ప్రభుత్వ భూములను ఈ డి-1 పట్టాల కింద కేటాయించారు. అయితే నిర్వాసితుల పేరిట ఈ ప్రక్రియనంతా నడిపిన అప్పటి అధికార పార్టీ నేతలు అలాగే కొంతమంది దళారులు వ్యూహాత్మకంగా వాటిని మళ్లీ తమ పేరిట రిజిస్ట్రేషన్‌లు చేసుకొని రెవెన్యూ రికార్డుల్లోకి ప్రవేశించినట్లు ఫిర్యాదులున్నాయి. సంబంధిత శాఖ అధికారుల అండదండలతోనే అప్పటి ప్రజా ప్రతినిధులు దాదాపు నాలుగేళ్ల పాటు ఎక్కడ పడితే అక్కడ సర్కారు భూములను స్వాహా చేసినట్లు చెబుతున్నారు. దాదాపు 2వేల ఎకరాలకు పైగా డి-1 పట్టాల పేరిట సర్కారు భూములను కొల్లగొట్టిన అప్పటి నేతలు వారి బంధువులు భూములను స్వాహా చేశారన్న విమర్శలున్నాయి. మొత్తం 350కి పైగా అక్రమ డి-1 పట్టాలను సృష్టించి ఈ పట్టాల పేరిట దాదాపు రెండున్నర వేల ఎకరాలకు పైగా విలువైన ప్రభుత్వ భూములను మాయం చేశారన్న ఆరోపణలున్నాయి. అయితే ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి మొదటి నుంచి ఆయన ఈ అంశాన్ని లేవనెత్తుతూ ఆందోళనలు కూడా చేపట్టారు. అప్పట్లో కూడా ఆయన బీఆర్ఎస్ ప్రభుత్వ పెద్దలకు ఈ అంశంపై ఫిర్యాదు చేసినప్పటికీ అప్పటి పాలకులు ఈ వ్యవహారాన్ని పక్కకు పెట్టేశారన్న వాదనలున్నాయి. అయితే ఇటీవలే జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో అప్పటి అధికార బీఆర్ఎస్ పార్టీ ఓటమి పాలు కావడం, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో పాటు బీజేపీ తరఫున ఎమ్మెల్యేగా ఏలేటీ మహేశ్వర్‌రెడ్డి గెలుపొందడంతో ఈ డి-1 పట్టాల వ్యవహారం మలుపు తిరిగిందంటున్నారు. ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టిన ఒకటి రెండు రోజుల్లోనే మహేశ్వర్‌రెడ్డి డి-1 పట్టాల అంశానికే అత్యధిక ప్రాధాన్యతనిస్తూ ఎదురుదాడి మొదలుపెట్టారు. ఆయన జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసి చర్యలు తీసుకోవాలంటూ కోరారు. అలాగే ప్రభుత్వానికి సైతం అప్పటి బీఆర్ఎస్ నాయకుల డి-1 అక్రమాలపై చర్యలు తీసుకోవాలంటూ కోరారు. దీని కారణంగా జిల్లా కలెక్టర్ డి-1 పట్టాల అక్రమాలపై సీరియస్‌గానే స్పందించడమే కాకుండా పూర్తిస్థాయిలో విచారణ జరిపి ప్రభుత్వానికి నివేదికలు సమర్పించారు. మూడు నాలుగు రోజుల్లో మొత్తం నకిలీ డి-1 పట్టాల వ్యవహారంపై సీరియస్‌గా చర్యలు మొదలుకాబోతున్నాయంటున్నారు. ముఖ్యంగా ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి సైతం ఈ అంశంపై పట్టుదలగా వ్యవహరిస్తున్న కారణంగా అక్రమార్కులపై ఇక చర్యలకు రంగం సిద్దంకాబోతోందంటున్నారు.

పూర్తిస్థాయిలో విచారణ జరిపిన కలెక్టర్

ఇదిలా ఉండగా నకిలీ డి-1 పట్టాల వ్యవహారంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సీరియస్‌గా చర్యలు తీసుకోవడం ప్రాధాన్యతను సంతరించుకుంది. కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచే ఆయనకు ఈ అంశంపై పెద్ద ఎత్తున ఫిర్యాదులు అందాయి. అయితే ఈ క్రమంలోనే కొంతమంది డి-1 బాధితులతో పాటు ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి స్వయంగా ఫిర్యాదు చేయడంతో కలెక్టర్ లోతైనా విచారణకు శ్రీకారం చుట్టారు. ఆయన ఆకస్మికంగా డి-1 పట్టాల జారీతో పాటు భూముల కేటాయింపుకు సంబంధించి వివరాలకు ఆధారాలతో సహా సేకరించారు. దీనికి అనుగుణంగానే ఆయన అధికారులతో కూడిన ప్రత్యేక బృందాలను నియమించి దర్యాప్తు జరిపించడం విశేషంగా చెప్పవచ్చు. ఈ అధికారుల బృందాలు సర్వే ల్యాండ్ రికార్డ్స్, రెవెన్యూశాఖ కార్యాలయాలతో పాటు పోచంపాడ్, నిజామాబాద్‌లలోని ఎస్సారెస్పీ రికార్డుల కార్యాలయాల్లో సైతం విచారణ జరిపారు. అయితే ఈ విచారణల ఆధారంగా కలెక్టర్ ప్రత్యేక నివేదికలు తయారు చేసి ఆ నివేదికలను ప్రభుత్వానికి అందించడంతో ఇక అసలు రంగం మొదలుకాబోతోందంటున్నారు.

కీలకంకానున్న కలెక్టర్ నివేదిక

కాగా దాదాపు 2వేలకు ఎకరాలకు పైగా ప్రభుత్వ భూములు డి-1 అక్రమ పట్టాల పేరిట అవకతవకలకు గురయ్యాయన్న ఆరోపణల నేపథ్యంలో కలెక్టర్ రూపొందించిన నివేదిక అత్యంత కీలకంకానుందని అంటున్నారు. కలెక్టర్ నివేదికల ఆధారంగానే ప్రభుత్వం డి-1 అక్రమార్కులపై కఠినచర్యలు తీసుకునేందుకు మార్గం సుగమం కానుందని అంటున్నారు. ఇప్పటి వరకు కిందిస్థాయి అధికారులు అలాగే పలువురు ఉన్నతాధికారులు ఈ అంశంపై తూతూ మంత్రంగా విచారణలు జరిపి చేతులు దులుపుకున్నారన్న విమర్శలున్నాయి. అప్పటి అధికార బీఆర్ఎస్ పార్టీ నేతలు తమ పలుకుబడి, పరపతితో సంబంధిత అధికారులపై ఒత్తిడిలు తీసుకువచ్చి విచారణను నిర్వీర్యం చేశారన్న విమర్శలు లేక పోలేదు. అయితే ఇలాంటి పరిణామాల నేపథ్యంలో ప్రస్తుత కలెక్టర్ తనదైన శైలిలో కొరఢా ఝులిపించి విచారణ జరిపించడం ప్రాధాన్యతను సంతరించుకుంటోంది. గత 20 రోజుల నుంచి కలెక్టర్ కొనసాగిస్తున్న విచారణల పర్వం సంబంధిత శాఖల్లోని అధికారులు, సిబ్బంది గుండెల్లో రైళ్లు పరిగెత్తించిందని అంటున్నారు. ఓ దశలో వీరంతా మరోసారి కలెక్టర్‌పైనా సైతం ఒత్తిడిలు తీసుకువచ్చేందుకు పైరవీలు జరిపారంటున్నారు.

పట్టువీడని మహేశ్వర్ రెడ్డి

కాగా మొదటి నుంచి డి-1 పట్టాల అక్రమాలపై పట్టుదలతో ఉన్న ఎమ్మెల్యే ఏలేటీ మహేశ్వర్‌రెడ్డి తన పట్టు ను వీడకుండా మొత్తం గుట్టురట్టు చేసే దిశగా వ్యవహరిస్తుండడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఆయన స్థానికంగా జిల్లా కలెక్టర్‌కే కాకుండా ఏకంగా రాష్ట్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. అలాగే అక్రమార్కులపై చర్యలు తీసుకోనట్లయితే బీజేఎల్పీ నేతగా అసెంబ్లీలో సైతం గళమెత్తుతానంటూ ప్రకటించారు. దీని కారణంగా అధికార యంత్రాంగం సైతం ఈ వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకొని లోతైనా విచారణ జరిపించడమే కాకుండా రేపోమాపో చర్యలకు సిద్ధమవుతున్నట్లు చెబుతున్నారు. ఈ వ్యవహారం ప్రస్తుతం ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులు, సిబ్బంది గుండెల్లో దడ పుట్టిస్తోందని అంటున్నారు.



అక్రమ పట్టాలపై చర్యలు తీసుకోవాలని అడిషనల్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న సిద్దిలకుంట గ్రామస్థులు (ఫైల్)



రోడ్డుపై ధర్నా నిర్వహిస్తున్న న్యూ సాంగ్వి గ్రామస్థులు (ఫైల్)



భజన చేస్తున్న దృశ్యం

ప్రారంభమైన అఖండ హరినామ సప్తాహం

ముథోల్, మార్చి 2 : మండల కేంద్రమైన ముథోల్‌లోని పశుపతినాథ్ శివాలయంలో శనివారం అఖండ హరినామ సప్తాహం అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. ఈ సప్తాహం బాలాజీ గురూజీ, రాందాస్ గురూజీ, దిగంబర్ గురూజీ నేతృత్వంలో గ్రామస్థులు, గ్రామ సంఘం, భజన మండలి ఆధ్వర్యంలో ఈ సప్తాహ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సప్తాహ కార్యక్రమం ఏడు రోజులపాటు జరుగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సప్తాహంలో ఉదయం వేకువ జామున కాకడ హారతి, రాత్రి వేళలో భజన కీర్తనలు ఉంటాయి. ఈ సప్తాహంలో జిల్లాలోని నలు మూలల నుండే కాకుండా మహారాష్ట్ర నుండి సైతం భజన దిండిలు పాల్గొని ఈ భక్తి కీర్తన కార్యక్రమంలో పాల్గొంటారు. సుమారు 14 సంవత్సరాల నుంచి ముథోల్‌లో గ్రామస్థులు అంగరంగ వైభవంగా హరినామ సప్తాహం చేపడుతున్నారు. ఈ సప్తాహం శనివారం రోజు ముగియనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు రోళ్ల రమేష్, నారాయణ, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి మెగా ప్లాంటేషన్ అవార్డు

బాసర, మార్చి, 2 : బాసర ఆర్జీయూకేటీ ట్రిపుల్ ఐటీ మెగా ప్లాంటేషన్ నిర్వహించినందుకు అవార్డు లభించింది. భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) విద్యా సంస్థల విభాగంలో బాసర క్యాంపస్‌ను ఎంపిక చేసింది. యూనివర్సిటీలో 70 వేల మొక్కలు నాటి సంరక్షిస్తున్నారని అందుకే ఈ అవార్డుకు ఎంపికైనట్లు వైస్ ఛాన్సలర్ వెంకటరమణ తెలిపారు. శనివారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో సీఐఐ సభ్యుల నుంచి వైస్ ఛాన్సలర్ వెంకటరమణ ఈ అవార్డును అందుకున్నారు.

స్కాలర్‌షిప్ ప్రోగ్రాంకు విద్యార్థుల ఎంపిక

బాసర, మార్చి, 2: సిమెన్స్ స్కాలర్‌షిప్ ప్రోగ్రాంకు బాసర ట్రిపుల్ ఐటీ నుంచి 22 మంది ఎంపికైనట్లు యూనివర్సిటీ అధికారులు తెలిపారు. నాలుగు సంవత్సరాల స్కాలర్‌షిప్‌తో పాటు ఇంటర్న్‌షిప్‌లు, సాఫ్ట్‌స్కిల్ డెవలప్‌మెంట్‌తో పాటు ఒక్కో విద్యార్థికి ల్యాప్‌టాప్ సంస్థ అందించనున్నట్లు పేర్కొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరండి

దిలావర్‌పూర్, మార్చి 2 : నిర్మల్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరాలని ఆ కళాశాల అధ్యాపకులు ప్రచారం నిర్వహిస్తున్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో ఇంటర్ రెండవ సంవత్సరం ఆంగ్ల పరీక్ష రాసి బయటకు వచ్చిన విద్యార్థులతో అధ్యాపకులు మాట్లాడారు. ఇంటర్ విద్య తర్వాత నాణ్యమైన విద్యను అందించే అత్యుత్తమ బోధన నైపుణ్యాలు కలిగిన అధ్యాపకులు నిర్మల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉన్నారని, తమ కళాశాలలో ప్రవేశాలు పొందాలని విద్యార్థులకు సూచించారు. ప్రైవేట్ కంపెనీలలో ఉద్యోగం కొరకు ట్రైనింగ్ ఇచ్చే టీఎస్‌కేసీ కేంద్రం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉన్నాయని విద్యార్థులకు వివరించారు.

నిర్మల్ కల్చరల్, మార్చి 2 : ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు నాణ్యమైన విద్య కోసం ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో చేరాలని కళాశాల అధ్యాపకులు శనివారం ప్రచారం నిర్వహించారు. అనుభవం, నైపుణ్యం గల అధ్యాపకులు విద్యాబోధన చేస్తారని విద్యార్థులు, తల్లిదండ్రులకు, పలు కళాశాలల్లో కరపత్రాలు అందజేశారు. అతిక్ బేగం, పీజీ రెడ్డి, రవి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

మంత్రులను కలిసిన నాయకపోడ్‌లు

నిర్మల్ కల్చరల్, మార్చి 2 : మామడ మండలం పరిమండల్ గ్రామానికి చెందిన నాయకపోడ్ సంఘ నాయకులు శనివారం రాష్ట్ర అటవీశాఖ మంత్రి కొండ సురేఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనసూయ, వర్కింగ్ పార్టీ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్‌గౌడ్‌లను కలిసి సమస్యలపై వినతిపత్రాన్ని అందజేశారు. జిల్లా అధ్యక్షుడు కే. శ్రీహరిరావు, సోషల్ మీడియా కో ఆర్డినేటర్ గంగాధర్ ఆధ్వర్యంలో కలిసిన వారికి సీఎం రేవంత్‌రెడ్డి ద్వారా సమస్యలు పరిష్కరిస్తామని మంత్రులు హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు.

లక్ష్మణచాంద ఎంపీపీ భర్తపై చర్యలు తీసుకోండి

అడిషనల్ కలెక్టర్ కిషోర్‌కుమార్‌కు కాంగ్రెస్ నాయకుల ఫిర్యాదు



అడిషనల్ కలెక్టర్ కిషోర్‌కుమార్‌కు వినతి పత్రాన్ని అందజేస్తున్న దృశ్యం

నిర్మల్ టౌన్, మార్చి 2 : లక్ష్మణచాంద ఎంపీపీ అడ్వాల పద్మ భర్త అయిన అడ్వాల రమేష్‌పై చర్యలు తీసుకోవాలని మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు జిల్లా కలెక్టర్, జిల్లా పరిషత్ సీఈవోకు శనివారం ఫిర్యాదు చేశారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో భారతీయ జనతాపార్టీ మీటింగ్ పెట్టి రాజ్యాంగ విరుద్ధమైన చర్యలకు పాల్పడ్డారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అధికారిక కార్యక్రమాలు నిర్వహించాల్సిన చోట పార్టీ కార్యక్రమాలను నిర్వహించారని, కావున కారకులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్య క్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఒడ్నాల రాజేశ్వర్, నాయకులు అబ్బిడి ప్రతాప్‌రెడ్డి, ఈటెల శ్రీనివాస్, కోండ్ర నరేష్‌రెడ్డి, గురాల లింగారెడ్డి, చింతకింది శేఖర్‌రెడ్డి, గంగాధర్‌గౌడ్, తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ హయాంలోనే నిరుద్యోగుల జీవితాల్లో వెలుగు

మున్సిపల్ చైర్మన్ రాజుర సత్యం

ఖానాపూర్, మార్చి 2 : కాంగ్రెస్ హయాంలోనే నిరుద్యోగుల జీవితాల్లో వెలుగు నిండుతుందని మున్సిపల్ చైర్మన్ రాజుర సత్యం అలియాస్ చిన్నం సత్యనారాయణ అన్నారు. శనివారం మండల కేంద్రంలో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇటీవల మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు చెబుతున్నట్లు నాయకులు పేర్కొన్నారు. స్థానిక తెలంగాణ చౌక్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం నిర్వహించారు. యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు శివసేనరెడ్డి, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ప్రొద్దుటూరు సతీష్‌రెడ్డి, అసెంబ్లీ కోఆర్డినేటర్ పోలంపల్లి సచిన్‌లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కావలి సంతోష్, యువజన కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షులు కిషోర్ నాయక్, పట్టణ అధ్యక్షులు నిమ్మల రమేష్, కాంగ్రెస్ నాయకులు తోట సత్యం, జహీర్, మడిగెల గంగాధర్, శెట్టి శ్యామ్, ఆసిఫ్, సౌకత్, గుండా నరేష్, శ్రీకాంత్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.



ఖానాపూర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం నిర్వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

పల్స్‌పోలియోకు ఏర్పాట్లు పూర్తి చేసిన వైద్య, ఆరోగ్యశాఖ

● జిల్లాలో 92,561 మంది చిన్నారుల లక్ష్యం



వ్యాక్సినేషన్ బాక్స్‌లను సిద్ధం చేస్తున్న వైద్య సిబ్బంది

భైంసా,మార్చి 2 : చిన్నారులకు చుక్కల మందు వేసేందుకు గాను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేశారు. పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించేందుకు అధికారులు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లావాప్తంగా ఐదేళ్ల లోపు ఉన్న 92,561 చిన్నారులకు చుక్కల మందు వేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

● పోలియో అంటే..?

పోలియో వ్యాధి సాధారణంగా 5 సంవత్సరాల లోపు పిల్లలకు పోలియో వైరస్ అనే క్రిమి వల్ల ఒకరి నుంచి మరొకరికి సంక్రమిస్తుంది. ఈ వ్యాధిని సమూలంగా నిర్మూలించడానికి నిరంతర పల్స్‌పోలియో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ వ్యాధి శరీరంలోని ఏ అవయవాన్ని అయినా (కాలు, చేయి, మెడ, తదితర) జీవితాంతం పక్షవాతానికి గురి చేస్తుంది. ఈ వ్యాధి నుంచి బయటపడాలంటే నోటి ద్వారా అందించే పోలియో చుక్కలను ప్రతి సారి అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి ఐదేళ్లలోపు చిన్నారులకు తప్పనిసరిగా వేయించాలి.

● 561 కేంద్రాల ఏర్పాటు

జిల్లాలో మొత్తం 561 పల్స్ పోలియో కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో 2,400 మంది సిబ్బంది పాల్గొంటున్నారు. 103 మొబైల్ టీంలను ఏర్పాటు చేశారు. అలాగే 56 మంది సూపర్‌వైజర్లను నియమించారు. 1.2 లక్షల డోసుల పోలియో వ్యాక్సిన్ వినియోగించేందుకు సిద్ధం చేశారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు 103 మొబైల్ టీంలు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి సంచార జాతుల పిల్లలకు, ఇటుక బట్టీలు నిర్వహిస్తున్న వారి పిల్లలతో పాటు తోటల్లో పనిచేసే కార్మికుల పిల్లలకు చుక్కల మందును వేయనున్నారు. ట్రాన్సిల్ కేంద్రాల ద్వారా రైల్వే, బస్ స్టేషన్లు, అంతర రాష్ట్ర చెక్‌పోస్టులు, సంతల్లో, జాతరల్లో ప్రయాణాల్లో చిన్నారులకు పోలియో చుక్కలు వేసేందుకు పలు బృందాలు నియమించారు. ఉదయం ఏడు గంటల నుంచి కార్యక్రమం ప్రారంభంకానుంది.

● చుక్కల మందుతో భవిష్యత్తుకు భరోసా

డీఐవో డా.నయనరెడ్డి

పోలియో మహమ్మారి బారి నుంచి మానవాళిని రక్షించే మహోన్నత కార్యక్రమం పల్స్‌పోలియో నిర్వహణకు గాను జిల్లావ్యాప్తంగా ఏర్పాట్లు పూర్తి చేశాం. శారీరక వైకల్యం ద్వారా మానవాళిని వెక్కిరించే వ్యాధిని దరి చేరనీయకుండా ప్రపంచ ఆరోగ్యసంస్థ మార్గదర్శనంలో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమంలో భాగంగా కొనసాగుతున్న కార్యక్రమం ఆదివారం జరుగుతుంది.అప్పుడే పుట్టిన పిల్లలు మొదలు ఐదు సంవత్సరాల లోపు ప్రతీ చిన్నారికి చుక్కల మందు వేయించి వారి బంగారు భవిష్యత్తుకు భరోసా కల్పించాలి. ఉదయం 7 గంటల నుంచి తల్లిదండ్రులు తమ తమ చిన్నారు లను పల్స్‌పోలియో కేంద్రాలకు తీసుకువెళ్లి చుక్కల మందును వేయిం చాలన్నారు. బస్టాండులు, వారంతపు సంతలు, బాసర రైల్వేస్టేషన్‌లో ప్రత్యేకంగా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లుగా పేర్కొన్నారు. ప్రతి తల్లిదండ్రులు కేంద్రాలకు వెళ్లి చుక్కల మందును వేయించుకోవాలి. ఇంటి వద్దకు వస్తారు కదా అని నిర్లక్ష్యం చేయకూడదని అన్నారు. ఒక్కో కేంద్రం వద్ద మొత్తం 300 మంది చిన్నారుల వరకు చుక్కల మందును వేస్తారని తెలిపారు. దేశవ్యాప్తంగా అంగవైకల్యం నమోదు ఆగిపోయేంత వరకు ప్రతీ యేటా రెండు విడతలుగా కొనసాగుతుందన్నారు.

సంక్షిప్త సమాచారం

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు ఇవే

నిర్మల్ కల్చరల్, మార్చి 2 : నెలవారీ మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 9 నుంచి 11 వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ పి. రవి ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ సబ్‌స్టేషన్ పనుల దృష్ట్యా ఈ పరిధిలోని బుధవార్‌పేట్, పాత బస్టాండ్, కలెక్టరేట్, ఇందిరానగర్, శాస్త్రినగర్, ప్రియదర్శిని నగర్, మైతినగర్, భాగ్యనగర్, బాగులవాడ, చిక్కడపల్లి, చైన్ గేట్, గొల్లపేట, విజయనగర్ కాలనీ వినియోగదారులు సహకరించాలని కోరారు.

పల్స్‌పోలియోపై అవగాహన ర్యాలీ

నిర్మల్ అర్బన్, మార్చి 2 : నిర్మల్ పట్టణంలోని బంగల్‌పేట్‌లో పల్స్ పోలియోపై అవగాహన ర్యాలీని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ధనరాజ్ మాట్లాడుతూ... 0-5 సంవత్సరాల లోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించాలని కోరారు. ఈ ర్యాలీలో డిప్యూటీ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రాజేందర్, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ నయనారెడ్డి, డిప్యూటీ జిల్లా విస్తరణ, మీడియా అధికారి బారె రవీందర్, డాక్టర్ మనీషా, కమ్యూనిటీ ఆర్గనైజర్ రాములు, పాఠశాల పిల్లలు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

..పోస్టర్ ఆవిష్కరణ

నిర్మల్ కల్చరల్, మార్చి 2 : జిల్లాలో ఆదివారం నిర్వహించే పల్స్‌పోలియో పోస్టర్‌ను అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్ శనివారం ఆవిష్కరించారు. జిల్లాలోని 92,562 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేసేలా సమన్వయంతో కృషి చేయాలని అదనపు కలెక్టర్ కోరారు. జిల్లా వైద్యాధికారి ధనరాజ్, డాక్టర్ నయనారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చిన్న పిల్లలకు చుక్కల మందు వేయించండి

దిలావర్‌పూర్, మార్చి 2 : 0-5 సంవత్సరాల చిన్న పిల్లలకు పల్స్ పోలియో చుక్కల మందు వేయించాలని మండల వైద్యాధికారి డా.శ్యామ్‌కుమార్ అన్నారు. నేటి నుంచి ఈ నెల 5వ తేదీ మంగళవారం వరకు పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. అప్పుడే పుట్టిన పిల్లల నుంచి ఐదు సంవత్సరాల వరకు ఉన్న పిల్లలకు పోలియో టీకాలు వేయించాలన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

కుభీర్ : ఈ నెల 3,4,5 తేదిలలో నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయ వంతం చేయాలని మండల వైద్యాధికారిణి డా.వద్నం వసుంధర అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి దిశ నిర్దేశం చేశారు. మండలంలో 5093 మంది 5సంవత్సరాలలో చిన్నారు లు ఉన్నట్లు గుర్తించామన్నారు. చుక్కమందు వేసేం దుకు 224 మంది వైద్యసిబ్బందిని నియమించి 49బూత్‌లు, ఒక మొబైల్ టీం బస్టాండ్‌లో ట్రాన్స్‌సిట్ పాయింట్ ఏర్పాటు చేశామన్నారు. నలుగురిని రూట్ సూపర్ వైజర్‌గా ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ శ్రీనివాస్, గిరి సాయి బాబు, ఆనంద్, ఏఎన్ఎం సరస్వతి, స్టాఫ్ నర్సు సమీ, ఆరోగ్య సిబ్బంది తదితరులున్నారు.

అంతర్‌గాంలో విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

● ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచె లేకనే ప్రమాదం


మృతి చెందిన ఎద్దు

భీంపూర్, ఫిబ్రవరి2: భీంపూర్ మండలం అంతర్ గాంలో శనివారం మేకల బక్కన్న యాదవ్ అనే రైతుకు చెందిన ఎద్దు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి మృతి చెందింది. ఈ ఎద్దు విలువ రూ. లక్ష ఉంటుందని రైతు ఆవేదన వ్యక్తంచేశాడు. వెటర్నరీ, విద్యుత్ శాఖ సిబ్బంది వచ్చి పంచనామా చేశారు. ఇదిలా ఉంటే ఈ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచె లేకనే ఈ ప్రమాదం జరిగింది. అక్కడ రైతులు, కూలీలు అనుకోకుండా ట్రాన్స్‌ఫార్మర్ దగ్గరికి వెళితే పెద్ద ప్రమాదం జరిగే అవకాశం ఉంది. ఈ విషయం ఎన్నిసార్లు విద్యుత్ అధికారులకు విన్నవించినా.. పట్టించుకోవడం లేదని స్థానిక రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ శాఖ సిబ్బంది బాధిత రైతుకు పరిహారం చెల్లించాలని మాజీ సర్పంచ్ బక్కి లలిత విజ్ఞప్తి చేశారు.

● పంటల రక్షణకు విద్యుత్ తీగలు వాడొద్దు : డిప్యూటీ రేంజ్ అధికారి

బోథ్,ఫిబ్రవరి 2:పంటల రక్షణ కోసం రైతులు విద్యుత్ కంచెలను ఏర్పాటు చేస్తే చర్యలు తప్పవని డిప్యూటీ రేంజ్ అధికారి సుందర్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని కౌటా(బి)గ్రామంలో అటవీ హక్కులు అడవుల పరిరక్షణపై రైతులకు అవగాహన కల్పించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ తీగల వాడకం వల్ల అటవీ జంతువులు మృత్యువాత పడుతున్నాయని.. అంతేగాక రైతులు సైతం ప్రమాదాలకు గురై చనిపోతున్నారని పేర్కొన్నారు. అడవి జంతువులను చంపినట్లయితే చట్టపరంగా శిక్షలు ఉంటాయని జైల్లోకి వెళ్లవలసి వస్తుందని వివరించారు. అక్రమ కలప రవాణా చేస్తే ఇబ్బందుల్లో పడతారని అటవీ నుంచి కలపను అక్రమంగా తీసుకు రావొద్దని అటవీ భూములను పరిరక్షించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌బీవోలులతో పాటు పీఎస్ వినోద్‌కుమార్‌లు ఉన్నారు.

మావలలో వ్యక్తి అదృశ్యం

మావల, ఫిబ్రవరి 2: పని నిమిత్తం ఇంటి నుంచి బయలుదేరిన ఓ వ్యక్తి అదృశ్యమైనట్లు రూరల్ ఎస్సై సయ్యద్ ముజాహిద్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. రూరల్ మండల భీంసారి గ్రామానికి చెందిన బొడి కే ప్రశాంత్ (30)ఫొటోగ్రాఫర్‌గా పని చేస్తుంటాడు. శుక్రవారం మధ్యాహ్నం సమయంలో ఇంటి నుంచి పెళ్లిషూట్ పని మీద వెళ్లి ఇంటికి రాలేదు. దీంతో తెలిసిన అన్నిచోట్ల, బంధువులు, స్నేహితుల వద్ద వెతికిన ఆచూకీ లభించ లేదు. కుటుంబీకులు శనివారం రూరల్ పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు.ఈమేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కొనసాగుతున్న ప్రధాని పర్యటన ఏర్పాట్లు

● ఆదిలాబాద్‌లో సభా స్థలిని పరిశీలించిన ఎంపీ, ఎమ్మెల్యేలు ● జిల్లాకు చేరుకున్న కేంద్ర భద్రత బలగాలు



ఆదిలాబాద్‌లో ముమ్మరంగా కొనసాగుతున్న సభాస్థలి ఏర్పాట్లు



ప్రధాని సభాస్థలి ఏర్పాట్లను అడిగి తెలుసుకుంటున్న కేంద్ర భద్రత సిబ్బంది, అధికారులు

ఆదిలాబాద్‌అర్బన్, మార్చి2:ఈ నెల 4న ప్రధాని నరేంద్రమోదీ పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లు కొనసాగుతున్నా యి. శనివారం బీజేపీ శాసనసభ పక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డితో పాటు ఆదిలాబాద్ ఎంపీ సోయంబాపు రావ్, ఎమ్మెల్యే పాయలశంకర్, జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానంద్, ఇతర ముఖ్యనాయకులు ఏర్పాట్లను పరిశీలించారు. కాగా ఎరోడ్రమ్‌లో హెలీప్యాడ్, ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో బహిరంగ సభ వేదిక నిర్మాణం పనులు చురుకుగా కొనసాగుతున్నాయి. ఉదయం, సాయంత్రం కేంద్ర అధికారుల బృందం ప్రత్యేక హెలిక్యాప్టర్‌లో జిల్లా కేంద్రం చుట్టు చక్కర్లు కొట్టారు. సోమవారం ప్రధాని పర్యటన సందర్భంగా జిల్లా కేం ద్రంలో ట్రాఫిక్ ఆంక్షలను విధించారు. ఇంటర్మీడియట్ పరీక్షలు ఉన్నందున విద్యార్థులు ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని అధికారులు సూచించారు. ఇప్పటికే ఎరోడ్రమ్‌తో పాటు ఇందిరా ప్రియదర్శిని స్టేడియం మైదాన ప్రాంతాన్ని కేంద్ర బలగాలు తమ ఆధీనంలోకి తీసుకొని పటిష్టమైన భద్రత చర్యలను చేపట్టాయి. హెలీప్యాడ్ నుంచి ఇందిరా ప్రియదర్శిని స్టేడియం వరకు చుట్టు పక్కల ప్రాంతాలలో డాగ్, బాంబు స్క్వాడ్‌లతో పోలీసులు ముమ్మర తనిఖీలు చేపట్టారు.



ప్రధాని నరేంద్రమోదీ పర్యటన షెడ్యూల్ ఖరారు

ప్రధానమంత్రి నరేంద్రమోదీ జిల్లా పర్యటన షెడ్యూల్ అధికారికంగా ఖరారైంది. ఈ నెల 4న ఉదయం 9.20 గంటలకు మహారాష్ట్రలోని నాగ్‌పూర్ ఎయిర్‌పోర్టుకు ప్రధాని చేరుకుంటారు. అక్కడి నుంచి ప్రత్యేక హెలిక్యాప్టర్‌లో 10.20కి ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఏరోడ్రమ్‌కు చేరుకుంటారు. 10.30 నుంచి 11 గంటల వరకు అక్కడ ఏర్పాటు చేసిన పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేస్తారు.11.5 గంటలకు అక్కడి నుంచి రోడ్డు మార్గాన బయలుదేరి 11.15కు ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో నిర్వహించే సభకు చేరుకుంటారు. మధ్యాహ్నం 12గంటల వరకు బహిరంగసభను ముగించుకుంటారు. 12.5 గంటలకు బయలు దేరి 12.15నిమిషాలకు హెలీప్యాడ్ వద్దకు చేరుకుంటారు. అక్కడి నుంచి నేరుగా మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లాకు వెళ్తారు.

ప్రధాని పర్యటన సందర్భంగా..

ఆదిలాబాద్‌లో ట్రాఫిక్ ఆంక్షలు

● పట్టణంలో రెండు రోజులు డ్రోన్లకు అనుమతి లేదు
● ఇంటర్మీడియట్ విద్యార్థులు పరీక్ష కేంద్రానికి త్వరగా చేసుకోవాలి
● జిల్లా ఎస్పీ గౌస్ ఆలం వెల్లడి



ఆదిలాబాద్‌అర్బన్, మార్చి2:ఈ నెల 4న ప్రధానమంత్రి ఆదిలాబాద్ పర్యటన సంద ర్భంగా పట్టణంలోని పలు రోడ్ల పై ట్రాఫిక్ ఆంక్షలు ఉండనున్నట్లు జిల్లా ఎస్పీ గౌస్‌ఆలం తెలిపారు.

● ప్రధానమంత్రి భద్రత చర్యల్లో భాగంగా స్థానిక ఏరోడ్రం, పరిస ర ప్రాంతాలు సాధారణ ప్రజలకు నిషేధిత ప్రాంతాలుగా ఉన్నాయ ని తెలిపారు. అందులో భాగంగానే కచ్‌కంటి గ్రామ ప్రజలు ఆది లాబాద్ పట్టణానికి రావడానికి పాత సాత్నాల రహదారిని వా డుకోవాలని, ఏరోడ్రం లోపలికి అనుమతి ఉందని తెలిపారు.

● కేఆర్‌కే కాలనీ వాసులు పట్టణంలోని రావడానికి మావ ల పోలీసు స్టేషన్ మీదుగా తిరుమల పెట్రోల్‌బంక్ వైపు ఉన్న రోడ్డును వాడుకోవాలన్నారు. అంకోలి, తంతోలి గ్రామ ప్రజలు పట్టణంలోకి రావడానికి కృష్ణ నగర్ మీదుగా మావల పీఎస్ ముందు ఉన్న రోడ్డును ఉపయోగించుకోవాలని ఎస్పీ సూచించారు.

● ప్రధానమంత్రి సభకు విచ్చేస్తున్న ప్రజలకు సంబంధి చిన ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్ల పార్కింగ్ ప్రదేశం వినా యక చౌక్‌లో గల మధురజిన్నింగ్, గౌతమ్‌మోడల్ స్కూల్ పార్కింగ్ ప్రదేశాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

● సభకు వచ్చే బస్సులకు సంబంధించిన పార్కింగ్ ప్రదేశం స్థానిక డైట్ కళాశాల మైదానం, రామ్‌లీలా మైదానం, టీటీడీసీ ఎదురుగా ఉన్న ప్రదే శం. సభాస్థలికి వచ్చే ప్రజలు, కార్యకర్తలు తమ పార్కింగ్ ప్రదేశాలలో మాత్రమే వాహ నాలను నిలపాలని సూచించారు.

● ఆదిలాబాద్ పట్టణంలో రెండు రోజుల పాటు ఆదివారం, సోమవారం ఎటువంటి డ్రోన్లు సభాస్థలి, హెలిప్యాడ్, పట్టణంలో ఎగుర వేయడం నిషేదమని పేర్కొన్నారు.

నిబంధనలు ఉల్లంఘించిన వారి పై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

● సోమవారం ఇంటర్మీడియట్ పరీక్ష సందర్భంగా అదే విధంగా పట్టణంలో ప్రధానమంత్రి బహిరంగ సభ, అభివృద్ధి కార్యక్రమాలు ఉన్నందున విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు వీలైనంత త్వరగా చేరుకుని పరీక్షలను విజయవంతంగా రాయాలన్నారు.

● జిల్లా ప్రజలు నిబంధనలకు అనుగుణంగా నడుచుకుంటూ పోలీసులకు సహకరించాలని ఎస్పీ కోరారు.

శివరాత్రి పర్వదినం కోసం గోదావరి తీరాన్ని పరిశుభ్రం చేయండి

● పుణ్య స్థానాలకై గోదావరికి ఎస్సారెస్పీ నుండి నీటి విడుదల చేయించాలి ● హిందూ ఉత్సవ సమితి అధ్యక్షులు మంత్రరాజం సురేష్

ఖానాపూర్, మార్చి 2 : మహాశివరాత్రి పర్వదినం రానున్న నేపథ్యంలో హిందువులు అత్యంత పవిత్రంగా భావించే నదీ స్నానాల కోసం గోదావరిని పరిశుభ్రం చేయాలని హిందూ ఉత్సవ సమితి అధ్యక్షులు మంత్రరాజం సురేష్ డిమాండ్ చేశారు. శనివారం హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో గోదావరి నది వద్ద స్నానాలఘాట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... నదిలో స్నానాలు చేసేందుకు వీలు లేకుండా నీటిమట్టం తగ్గిపోయిందన్నారు. పవిత్రమైన గోదావరి నదిలో చెత్తా చెదారం పేరుకుపోయి కంపు కొడుతుందన్నారు. వెంటనే పాలకులు స్పందించి గోదావరి నదిని పరిశుభ్రం చేయించాలని డిమాండ్ చేశారు. ప్రతీ ఏటా మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా పుణ్యస్నానాలు ఆచరించేందుకు ఉత్తరం దిశగా ప్రవహించే ఖానాపూర్ గోదావరి తీరానికి భక్తులు భారీగా తరలివస్తారన్నారు. ఈ ఏడాది సైతం భక్తులు భారీగా తరలి రానున్న నేపథ్యంలో భక్తుల నదీ స్నానాలకు అనుకూలంగా స్థానిక ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు చొరవ తీసుకొని ఎస్సారెస్పీ నుంచి గోదావరి నదికి నీటిని విడుదల చేయించాలన్నారు. శివరాత్రి పర్వదినానికి ఒక్కరోజు ముందు నీటిని విడుదల చేయిస్తే ఖానాపూర్ తీరం వరకు నీరు చేరే అవకాశం ఉంటుందన్నారు. ఈ దిశగా చర్యలు చేపట్టి మహా శివరాత్రి పర్వదినాన భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా చూడాలని ఆయన కోరారు. డ్రైనేజీ లీకేజీ వాటర్ గోదావరి నదిలో చేరకుండా మున్సిపల్ పాలకవర్గం వెంటనే స్పందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హిందూ ఉత్సవ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు అల్లాడి వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి శెట్టిరామ్ మోహన్‌రావు, ఉపాధ్యక్షులు బీసీ రమేష్, చింతామణి శ్రీనివాస కృష్ణస్వామి, తదితరులున్నారు.



గోదావరిని పరిశీలిస్తున్న హిందూ ఉత్సవ సమితి నాయకులు

నేడు మార్కెట్ కమిటీ

చైర్మన్‌ప్రమాణ స్వీకారం

బోథ్, ఫిబ్రవరి 2 : బోథ్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమించబడ్డ బొడ్డు గంగారెడ్డి ఆదివారం మధ్యాహ్నం రెండు గంటలకు మార్కెట్ కమిటీ పాలకవర్గంతో పాటు చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి పంచాయితీరాజ్ గ్రామీణ అభివృద్ధి స్త్రీ సంక్షేమ శాఖ మంత్రి అయిన దానసరి అనూయ సీతక్క కార్యక్రమానికి హాజరుకానున్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు గాను కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని నియోజకరవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్ పిలుపునిచ్చారు.

పబ్లిక్ స్కూల్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ఉట్నూర్, మార్చి 2 : హైదరాబాద్ పబ్లిక్ స్కూళ్లో అర్హులైన గిరిజనుల బాల బాలికలకు 6 సీట్లు కేటాయించడం జరిగిందని ఉట్నూర్ ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా,డీడీ దిలీప్‌కుమార్‌లు తెలిపారు. బాలికలకు మూడు, బాలురకు మూడు సీట్లు ఉన్నాయని ఒకటవ తరగతిలో ప్రవేశం కోసం ఈ నెల 11 వరకు దరఖాస్తులు చేసుకోవాలని, 14న లక్కీ డ్రా నిర్వహించి అర్హులను ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. గొండు, నైకపోడులకు 3, కోలాం, అంద్, ప్రధాన్‌లకు 1, లంబాడాలకు 1, ఇతర గిరిజనులకు 1 సీట్లు కేటాయించారు.

నాన్ బెయిలెబుల్ వారెంట్ నిందితులను సత్వరమే కోర్టులో హాజరుపరచాలి

భైంసా, మార్చి 2 : వివిధ కేసులకు సంబంధించి నాన్ బెయిలేబుల్ వారెంట్ నిందితులను కాలయాపనకు తావులేకుండా సత్వరమే అదుపులోకి తీసుకొని కోర్టులో హాజరుపరచాలని భైంసా న్యాయాధికారి దేవేంద్రబాబు ఆదేశించారు. శనివారం కోర్టు హాల్‌లో ఈ నెల 16న జరిగే లోక్ ఆదాలత్‌కు సంబంధించి డివిజన్ పరిధిలోని పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఆయా పోలీసు స్టేషన్ల వారీగా పెండింగ్‌లోనున్న కేసులను సత్వరమే పరిష్కరించేందుకు అవసరమైన చర్యలను వేగవంతం చేయాలన్నారు. లోక్ ఆదాలత్‌ను విజయవంతం చేసేందుకు చేపట్టాల్సిన చర్యలను సూచించారు. అనంతరం అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి.అరుణ కొత్తగా వచ్చిన భారతీయ న్యాయ సంహిత చట్టంపై పోలీసు అధికారులకు అవగాహన కల్పించారు. ఇదే క్రమంలో పెండింగ్‌లోనున్న కేసులపై సమీక్ష నిర్వహించి వాటిని పరిష్కరించేందుకు అనుసరించాల్సిన విధానాలపై సూచనలు,సలహాలు అందించారు. ఇందులో భైంసా ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్, డివిజన్ పరిధిలోని ముగ్గురు సర్కిల్ ఇన్స్‌పెక్టర్లతో పాటు ఆయా పోలీసు స్టేషన్ల ఎస్ఐలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయాధికారి దేవేంద్రబాబు

గృహజ్యోతి పథకం జీరో బిల్లు అందజేసిన ఎమ్మెల్యే

నిర్మల్ కల్చరల్, మార్చి 2 : ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో భాగంగా గృహజ్యోతి పథకానికి చెందిన లబ్ధిదారులకు ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి శనివారం జీరో బిల్లును అందజేశారు. గాజులపేటలో 200ల యూనిట్ల లోపు వినియోగదారుడికి స్వయంగా రీడింగ్ నమోదు చేసి జీరో బిల్లు అందజేశారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, విద్యుత్ శాఖ ఎస్ఈ జేఆర్ చౌహాన్, డీఈ, ఏఈలు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

భైంసా : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీల్లోని ఆరు గ్యారెంటీలను దశలవారీగా అమలు పరుస్తోంది. ఇందులో భాగంగానే శనివారం 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగదారులకు ఉచితంగా విద్యుత్ సరఫరాను అందించే గృహజ్యోతి పథకానికి శ్రీకారం చుట్టింది. రెవెన్యూ డివిజన్ కేంద్రమైన భైంసాలో ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్ 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగించే వినియోగదారులకు జీరో విద్యుత్ బిల్లులను అందించే ప్రక్రియను లాంఛనంగా ప్రారంభించారు. ఇందులో మున్సిపల్ కౌన్సిలర్ గౌతం పింగ్లే, మాజీ మున్సిపల్ చైర్మెన్ బాజనోల్ల గంగాధర్, బీజేపీ ముథోల్ నియోజక వర్గ కన్వీనర్ తాడేవార్ సాయినాథ్, భైంసా పట్టణ కమిటీ అధ్యక్షుడు ఎనుపోతుల మల్లేశ్వర్, ప్రతినిధులు పాల్గొన్నారు.

దస్తూరాబాద్ : గృహజ్యోతి పథకంలో భాగంగా మండల కేంద్రంలోని విద్యుత్ వినియోగదారులకు విద్యుత్ సిబ్బంది జీరో బిల్లులు జారీ చేశారు. విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బంది శనివారం మండల కేంద్రంలో విద్యుత్ వినియోగదారుల ఇళ్లకు వెళ్లి మీటర్లలో రీడింగ్ చూసి జీరో బిల్లులను ఇచ్చారు.

పెంబి : మండల కేంద్రంలో విద్యుత్ వినియోగదారులకు శనివారం కాంగ్రెస్ మండల అధ్యక్షులు సల్ల స్వప్నిల్‌రెడ్డి జీరో బిల్ అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన గ్యారంటీలను నెరవేరుస్తుందని అందులో భాగంగా గృహజ్యోతి పథకాన్ని ప్రారంభించిందన్నారు.

యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో

డీఎస్సీ నోటిఫికేషన్ సంబరాలు

● ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం

భైంసా, మార్చి 2 : రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయడాన్ని పురస్కరించుకొని భైంసాలో యూత్ కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు జరిపాయి. శనివారం యూత్ కాంగ్రెస్ ముథోల్ నియోజకవర్గ ఇన్‌చార్జీ అటల్ దేవిదాస్, ఎన్ఎస్‌యూఐ జిల్లా ప్రతినిధి షేక్ అంజాద్, కాంగ్రెస్ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రతినిధి శంకర్ చంద్రేల ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ ఎదుట ప్రదర్శనలు చేపట్టారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా పెద్దపెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో శనివారం యూత్ కాంగ్రెస్ ముథోల్ నియోజకవర్గ ఇన్‌చార్జీ అటల్ దేవిదాస్, ఎన్ఎస్‌యూఐ జిల్లా ప్రతినిధి షేక్ అంజాద్‌లు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యతననుసరిస్తూ ఎన్నికల హామీలను అమలుపరుస్తోందన్నారు. ఇందులో నియోజక వర్గ పరిధిలోని ఏడు మండలాల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మధు పటేల్, మహేందర్‌రెడ్డి, నకిడి నవీన్, మహమ్మద్ షఫీ, శ్రీనివాస్, మూయిస్ అహ్మద్‌లతో పాటు పలువురుప పాల్గొన్నారు.

ఘనంగా మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి

నిర్మల్ కల్చరల్, మార్చి 2 : నిర్మల్ జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు 87వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రజలు చిరకాలం గుర్తుంచుకునేలా శ్రీపాదరావు సేవలందించారన్నారు.

సీఎంను దుబాయ్‌కి ఆహ్వానించిన ఎన్ఆర్ఐ బృందంలో

ఖానాపూర్ వాసికి అవకాశం

ఖానాపూర్, మార్చి 2 : గల్ఫ్ కార్మికుల సమస్యలపై దుబాయ్ దేశంలో నిర్వహించనున్న బహిరంగ సభకు హాజరు కావలసిందిగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆహ్వానించేందుకు వెళ్లి ఎన్ఆర్ఐ బృందంలో ఖానాపూర్ వాసి గుండేటి గణేష్‌కు అవకాశం దక్కింది. శనివారం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని సీఎం కార్యాలయంలో కాంగ్రెస్ ఎన్ఆర్ఐ సెల్ నాయకులతో పాటు ఖానాపూర్‌కు చెందిన ఎన్ఆర్ఐ ఓమన్ తెలంగాణ సమితి అధ్యక్షులు గుండేటి గణేష్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా సీఎంను దుబాయ్ బహిరంగ సభకు హాజరుకావాల్సిందిగా ఆహ్వానించినట్లు ఆయన ఆంధ్రజ్యోతికి ఫోన్‌లో వివరించారు. గల్ఫ్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరినట్లు ఆయన పేర్కొన్నారు. సీఎంను కలిసిన వారిలో టీపీసీసీ ఎన్ఆర్ఐ సెల్ చైర్మన్ వినోద్ కుమార్, గల్ఫ్ కన్వీనర్ సింగిరెడ్డి నరేష్ రెడ్డి, టీపీసీసీ ఎన్ఆర్ఐ సెల్ కన్వీనర్ మంద భీమ్ రెడ్డి, నేషనల్ వర్కర్స్ వెల్ఫేర్ ట్రస్ట్ అధ్యక్షులు సిస్టర్ లీజీ జోసెఫ్ తదితరులున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఆలయ వార్షికోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే

భైంసా రూరల్, మార్చి 2 : మండలంలోని కామోల్ గ్రామంలో శ్రీ మహాలక్ష్మి, పోచమ్మ ఆలయ మొదటి వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ పాల్గొని ప్రత్యేకపూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాజకీయాలకు అతీతంగా గ్రామ అభివృద్దే లక్ష్యంగా ప్రజలు ఐక్యమత్యంతో ఉండాలన్నారు. మహాలక్ష్మి అమ్మవారి ఆశీస్సులతో గ్రామం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు.

andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY శనివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 38.3 । కనిష్ఠం 25.2

ఆదిలాబాద్
జిల్లా వార్తలు


5

ఆదివారం 3 మార్చి 2024



‘4న పరీక్ష కేంద్రానికి ముందే రావాలి’

ఆదిలాబాద్అర్బన్,మార్చి 2 : ఈ నెల 4న ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆదిలాబాద్‌లో జరిగే బహిరంగ సభకు హాజరవుతున్నారు. ఈనేపథ్యంలో ట్రాఫిక్ నిబంధనల దృష్ట్యా.. 4వ తేదీన జరిగే ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సర విద్యార్థులు పరీక్ష కేంద్రానికి నిర్ణీత సమయం కంటే ముందుగానే చేరుకోవాలని డీఐఈవో రవీంద్రకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు ఉదయం 9గంటల కంటే ముందుగానే రావాలని సూచించారు. ట్రాఫిక్ మళ్లింపు దృష్ట్యా విద్యార్థులు తప్పకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన కోరారు.



జిల్లాకు ప్రధాని..

భరోసా దక్కేనా?



- ప్రధాని నరేంద్రమోదీ రేపటి పర్యటనపై భారీ ఆశలు
- దీర్ఘకాలిక సమస్యలపై దృష్టి సారిస్తే మేలు
- ఎన్నికల ప్రచారాస్త్రంగా మారిన సీసీఐ పునరుద్ధరణ
- అడుగు ముందుకు పడని ఆదిలాబాద్ - ఆర్మూర్ రైల్వేలైన్
- కలగానే మారిన ఏరోడ్రమ్ నిర్మాణం.. కేంద్రీయ విశ్వ విద్యాలయం
- గిరిజన యూనివర్సిటీ కోసం పట్టుబడుతున్న ఆదివాసీలు
- సర్వత్రా ఆసక్తి రేపుతున్న ప్రధానమంత్రి జిల్లా పర్యటన



జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్



మూతపడిన సీసీఐ పరిశ్రమ

ఆదిలాబాద్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి)

ప్రధానమంత్రి నరేంద్రమోదీ సోమవారం జిల్లాలో పర్యటించనున్నారు. 41ఏళ్ల తర్వాత ప్రధాని హోదాలో నరేంద్రమోదీ జిల్లాకు రానున్నారు. దీంతో జిల్లా వాసులు ఆయన పర్యటనపై భారీ ఆశలు పెట్టుకుంటున్నారు. ఉత్తర తెలంగాణ ముఖద్వారంగా పిలిచే జిల్లాకు భరోసా దక్కుతుందన్న ఆశతో ఎదురు చూస్తున్నారు. 1983లో రాజీవ్‌గాంధీ ప్రధాని హోదాలో ఎన్నికల ప్రచారంలో భాగంగా జిల్లాకు రాగా.. మళ్లీ నాలుగు దశాబ్దాల తర్వాత ప్రధాని నరేంద్రమోదీ పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన, పార్లమెంట్ ఎన్నికల బహిరంగ సభలో పాల్గొనేందుకు జిల్లాకు వస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ ఇంకా ఖరారు కాకముందే ఓ అడుగు ముందుకేసిన బీజేపీ ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టనుంది. గత ప్రభుత్వాల హయాంలో జిల్లాపై పాలకుల నిర్లక్ష్యమే కనిపించింది. దీంతో ఏ మాత్రం అభివృద్ధికి నోచుకోలేదు. ఇప్పటికి ఎన్నో మారుమూల గిరిజన గ్రామాలకు కనీసం రోడ్డు, విద్యుత్ సౌకర్యం కూడా లేదంటే అతిశయోక్తి కాదు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కాస్త నాలుగు జిల్లాలుగా విడిపోవడంతో విద్య, ఉపాధి, పరిశ్రమల పరంగా పూర్తిగా వెనుకబడిపోయింది. ఇప్పటికి జిల్లాలో చెప్పుకోదగిన ఏ ఒక్క పరిశ్రమ లేక పోవడంతో నిరుద్యోగుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. స్థానికంగా ఉపాధి అవకాశాలు దూరం కావడంతో యువత ఇతర ప్రాంతాలకు తరలిపోతున్నారు. రాష్ట్రంలోనే అత్యధిక వర్షపాతం నమోదయ్యే జిల్లాగా పేరున్న ఇంకా ఆరుతడి పంటల పైననే ఆధారపడాల్సి వస్తుంది. ఎందుకంటే వృథాగా దిగువకు వెళ్లిపోతున్న నీటి వనరులను ఒడిసి పడితే జిల్లాలో వేల ఎకరాల బీడు భూములు సస్యశ్యామలం కానున్నాయి. జిల్లాలో నెలకొన్న దీర్ఘకాలిక సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నెల 4న ప్రధానమంత్రి పర్యటనపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

● కనుమరుగవుతున్న సీసీఐ పరిశ్రమ

గత 30ఏళ్ల క్రితం మూతబడిన సీసీఐ పరిశ్రమ కనుమరుగై పోతోంది. ప్రతీసారి ఎన్నికల సమయంలో అధికార, ప్రతిపక్షాలు సీసీఐ పునరుద్ధరణ అంశాన్ని ప్రచారాస్త్రంగా చేసుకోవడం పరిపాటిగానే మారింది. కాని ఏ ఒక్క పార్టీ, ప్రభుత్వం సీసీఐ పునరుద్ధరణకు చిత్తశుద్ధితో పని చేసిన దాఖలాలు లేవు. పరిశ్రమను పునరుద్ధరించేందుకు అన్ని రకాల అవకాశాలు ఉన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదంటున్నారు. సీసీఐ పరిశ్రమను పునరుద్ధరిస్తే సుమారు 5వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలను కల్పించవచ్చు. ఇంతటి ప్రాధాన్యత ఉన్న సీసీఐ పరిశ్రమను ప్రభుత్వాలు పట్టించుకోక పోవడంతో విలువైన పరిశ్రమ భూములు కబ్జాకుగురై కనిపించకుండానే పోతున్నాయి. కోట్ల విలువ చేసే పరిశ్రమ భవనాలు, యంత్ర పరికరాలు తుప్పుపట్టి పోయి నేలమట్టమవుతున్నాయి. అధికారంలోకి వస్తే పరిశ్రమను పునరుద్ధరిస్తామని హామీలిచ్చిన అన్ని పార్టీల నేతలు.. ఎన్నికల తర్వాత పూర్తిగా సైలెంట్‌ై పోతున్నారు. న్యాయపరమైన చిక్కులు ఉన్నాయంటూ చేతులెత్తేస్తున్నారు. ఇకనైనా కేంద్ర ప్రభుత్వం దృష్టి సారిస్తే పునరుద్ధరణకు అవకాశం లేక పోలేదన్న వాదనలు వినిపిస్తున్నాయి.

● సర్వే దశలోనే రైల్వేలైన్

ఆదిలాబాద్ - ఆర్మూర్ వయా పటాన్‌చెరువు రైల్వేలైన్ నిర్మాణ పనులు ఆరేళ్లు గడుస్తున్నా.. ఇంకా సర్వే దశలోనే కనిపిస్తున్నాయి. అడుగు ముందుకు పడకపోవడంతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సర్వే పనుల కోసం రూ.7కోట్ల నిధులను కేటాయించామని బీజేపీ నేతలు చెబుతున్నా.. ఎందుకు ఏళ్ల తరబడి సర్వే పనులు కొనసాగుతున్నాయో అర్థం కావడం లేదు. జిల్లా పార్లమెంట్ స్థానాన్ని బీజేపీ తన ఖాతాలో వేసుకున్నా.. రైల్వేలైన్ నిర్మాణ పనుల్లో పురోగతి కనిపించడం లేదు. మోదీ పర్యటనతోనైనా పనులు మరింత వేగవంతమవుతాయని అందరూ భావిస్తున్నా.. అది సాధ్యమయ్యేలా కనిపించడం లేదు. గత కొద్ది రోజులుగా జిల్లా కేంద్రంలో రైల్వేలైన్ సాధన సమితి పేరిట రిలే నిరాహార దీక్షలను చేపడుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆశించిన స్థాయిలో స్పందించినట్లు కనిపించడం లేదు. ఇప్పటికే మంజూరైన తాంసి బస్టాండ్ రైల్వే అండర్‌బ్రిడ్జి పనులకు అడ్డంకులు ఏర్పడుతున్నాయి. ఉపాధిని కోల్పోతామంటూ స్థానిక వ్యాపారులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఆర్డీవో కార్యాలయం వద్ద నిర్మించే ఓవర్ బ్రిడ్జి పనులు నామమాత్రంగానే సాగుతున్నాయి.

● కలగానే గాలిమోటర్ ఆశలు

జిల్లా కేంద్రంలో ఎరోడ్రమ్‌ను నిర్మించేందుకు ఎన్నో ఏళ్ల క్రితం భూసేకరణ చేపట్టిన ఆచరణ సాధ్యం కావడం లేదు. సుమారుగా 300ల ఎకరాలకు పైగా అధికారులు స్థల సేకరణ చేశారు. అయిన కేంద్ర ప్రభుత్వం ఎరోడ్రమ్ నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్ ఇవ్వక పోవడంతో జిల్లా వాసుల గాలిమోటర్ ఆశలు ఆవిరవుతున్నాయి. విమానాశ్రయ నిర్మాణానికి అనువైన ప్రాంతమైనప్పటికీ.. ప్రభుత్వాలు, పాలకులు పట్టించుకోవడం లేదంటున్నారు. ఇప్పటికే సర్వే పనులు పూర్తి అయిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం లేకపోవడంతో ఏరోడ్రమ్ నిర్మాణం కలగానే మారుతుంది. ఎన్నికల సమయంలోనే అధికార, ప్రతిపక్షాలు దీనిపై విమర్శలు చేసుకోవడం.. ఆ తర్వాత నిర్లక్ష్యంగా వదిలేయడంతో పూర్తిగా మరుగున పడిపోతోంది. అలాగే జిల్లా కేంద్రంలో కేంద్రీయ విశ్వవిదాయలయాన్ని నిర్మించేందుకు పదిఎకరాల స్థల సేకరణను చేపట్టిన మంజూరుకాక పోవడంతో ఎదురు చూపులు తప్పడం లేదు. జిల్లా వాసులకు మెరుగైన విద్య అవకాశాలు దూరమవుతున్నాయి.

● చేజారి పోయిన యూనివర్సిటీ

గతంలో జిల్లాకు గిరిజన యూనివర్సిటీ వచ్చినట్లే వచ్చి చేజారిపోవడంతో ఆదివాసీ గిరిజనులు తీవ్ర అసంతృప్తికి గురయ్యారు. అప్పట్లో ఉట్నూర్‌లో గిరిజన యూనివర్సిటీని ఏర్పాటు చేసేందుకు స్థలసేకరణను కూడా పూర్తి చేసిన ప్రయోజనం లేకుండా పోయింది. జిల్లా పాలకుల నిర్లక్ష్యంతో ములుగు జిల్లాకు గిరిజన యూనివర్సిటీని తరలించారు. విద్య అవకాశాలు అందుబాటులో లేకపోవడంతో ఆదివాసీ గిరిజనులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారు. ఆర్థిక పరిస్థితులు, పేదరికంతో సుదూర ప్రాంతాలకు వెళ్లి చదువుకునే స్తోమత లేక మధ్యలోనే చదువులను ఆపేస్తున్నారు. ముఖ్యంగా గిరిజన మహిళ విద్యార్థులు ఇంటర్ వరకే చదివి ఇంటికే పరిమితమవుతున్నారు. గతంలో ఆదివాసీ గిరిజన విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఎన్నో పోరాటాలు, నిరసనలు చేపట్టినా.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకున్న పాపాన పోలేదు. తమకు ఉచితాలు అవసరం లేదని, మెరుగైన విద్య వైద్య అవకాశాలను కల్పించాలని ఆదివాసులు కోరుతున్నారు. జిల్లా కేంద్రంలో నిర్మించిన సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి కూడా అలంకార ప్రాయంగానే మారింది. కోట్ల రూపాయలు ఖర్చు చేసినా.. సరిపడా వైద్యులు లేకపోవడంతో పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందడం లేదు. ఈ క్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ జిల్లా పర్యటనలో ఇచ్చే వరాలపై ప్రజలు గంపెడాశలు పెట్టుకున్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ



బాల్య వివాహాలను అంతా అరికట్టాలి

జైనథ్, మార్చి 2: సమాజంలో జరుగుతున్న బాల్య వివాహాలను అరికట్టే బాధ్యత అందరిపైనా ఉందని మేడిగూడ (ఆర్) గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ క్యాతంరాంరెడ్డి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలలో భాగంగా.. శనివారం మండలంలోని మేడిగూడ ఆర్ గ్రామంలో అంగన్‌వాడీ ఉపాధ్యాయులతో కలిసి వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 8న జరిగే అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జయప్రదం చేయాలని కోరారు. గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవడంలో దృష్టి సారించాలన్నారు. ఆ తర్వాత రక్తహీనత వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్వేరోస్‌జిల్లా అధ్యక్షులు పి.ఊశన్న,టీచర్లు కళావతి, ఆశావర్కర్లు వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

సాదాసీదాగా..



మున్సిపల్ వార్షిక బడ్జెట్ సమావేశం

ఆదిలాబాద్అర్బన్, మార్చి 2 : ఆదిలాబాద్ మున్సిపల్ వార్షిక బడ్జెట్ సమావేశాన్ని శనివారం మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో మున్సిపల్ చైర్మన్ జోగుప్రేమేందర్ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశం మొత్తం ఎలాంటి కొత్త నిర్ణయాలు లేకుండా సాదాసీదాగా జరిగింది. 2024-25 సంవత్సరం వార్షిక అంచనా వ్యయంపై సభ్యులు చర్చించారు. మొత్తం అంచనా ఆదాయం రూ.9631.07 లక్షలు, మొత్తం అంచనా వ్యయం రూ.9593.70 లక్షలు, మిగులు రూ.37.37 లక్షలుగా అంచనా వేశారు. జనరల్ ఫండ్‌ను ముందుగా కార్మికుల వేతనాలకు చెల్లించే విధంగా చూడాలని సభ్యులు కోరారు.

అత్యధిక ఎంపీ సీట్లను గెలుస్తాం!



పట్టణంలో ప్రధాని సభా స్థలిని పరిశీలిస్తున్న ఎంపీ సోయం, ఎమ్మెల్యేలు ఏలేటి, పాయల శంకర్

- దేశంలో రాబోయేది రామరాజ్యం
- బీజేపీ శాసనసభ పక్షనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి
- ఎంపీతో కలిసి ప్రధాని సభా ఏర్పాట్ల పరిశీలన

ఆదిలాబాద్ అర్బన్, మార్చి 2 : పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణలో అత్యధిక ఎంపీ సీట్లను గెలుస్తామని బీజేపీ శాసనసభ పక్షనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. తెలంగాణపై అభిమానంతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గత నాలుగు నెలల వ్యవధిలోనే ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలో రెండో సారి పర్యటిస్తున్నారని తెలిపారు. ఈ నెల 4వ తేదీన ఆదిలాబాద్‌కు ప్రధాని రానున్న సందర్భంగా.. పట్టణంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ఎంపీ సోయం బాపురావ్, ఎమ్మెల్యే పాయల శంకర్‌తో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. సభాస్థలి, అతిథుల గ్యాలరీ, పార్కింగ్ తదితర వాటి గురించి తెలుసుకున్నారు. అనంతరం ఏలేటి మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. దాదాపు 45ఏళ్ల తర్వాత ఓ ప్రధాన మంత్రి ఆదిలాబాద్‌కు వస్తున్నారన్నారు. వేలాది కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టే అభివృద్ధి పనులకు ఈనెల 4వ తేదీన జరిగే సభలో ప్రధాని మోదీ శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. ప్రధాని రాక కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు. దాదాపు లక్ష మందితో సభ నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. గతంలో ఆదిలాబాద్ ఎంపీ సీటును బహుమానంగా ఇచ్చామని, ఈసారి జరిగే ఎన్నికల్లో తెలంగాణలో అత్యధిక సీట్లు అందిస్తామని ధీమా వ్యక్తం చేశారు. దేశంలో రాబోయేది రామ రాజ్యమేనన్నారు. అనంతరం ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్రమోదీ బోరజ్ నుంచి బేల బోర్డర్ వరకు రూ.500 కోట్ల వ్యయంతో చేపట్టే రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ జిల్లా పరిషత్ చైర్మన్ జనార్ధన్ రాథోడ్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.





బ్రహ్మోత్సవంలో పాల్గొన్న భక్తులు



రథోత్సవం ఊరేగింపు

కమనీయం..
శ్రీనివాస కల్యాణం

● తలమడుగులో వైభవంగా ముగిసిన బ్రహ్మోత్సవాలు

తలమడుగు, మార్చి2 : మండల కేంద్రంలోని అతి పురాతనమైన శ్రీవెంకటేశ్వర ఆలయంలో మూడు రోజుల పాటు నిర్వహించిన బ్రహ్మోత్సవాలు శనివారంతో ముగిశాయి. గత మూడు రోజులుగా ఆలయంలో వేద పండితులతో మహాయజ్ఞ కార్యక్రమాలు స్వామి వారికి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ముగింపు సందర్భంగా శనివారం యజ్ఞం, పూర్ణాహుతి శ్రీనివాస కల్యాణాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. సాయంత్రం పూట రథోత్సవంపై స్వామి వారి ఉత్సవ విగ్రహాలతో మేళా తాళాలతో ఊరేగింపు నిర్వహించారు. ఈ బ్రహ్మోత్సవాల్లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగ్‌బ్రహ్మానందం, మాజీ ఎమ్మెల్యే రాథోడ్‌బాపురావు, జడ్పీటీసీ గోకగణేష్‌రెడ్డి, ఎంపీపీ కళ్యాణలక్ష్మి రాజేశ్వర్, తహసీల్దార్ రాజమోహన్, ఎంపీడీఓ రమాకాంత్, ఎంపీటీసీ చంటి తదితరులు పాల్గొన్నారు.

● ఘనంగా శ్రీపాదరావు 87వ జయంతి

ఆదిలాబాద్ అర్బన్, మార్చి2 : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ శాసనసభ స్పీకర్ దివంగత దుద్దిళ్ల శ్రీపాదరావు 87వ జయంతి వేడుకలను శనివారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు. అదనపు కలెక్టర్ శ్యామలదేవి శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

తలమడుగు : దుద్దిళ్ల శ్రీపాదరావు 87వ జయంతి సందర్భంగా మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ గోకగణేష్‌రెడ్డి, ఎంపీపీ కళ్యాణలక్ష్మి రాజేశ్వర్, తహసీల్దార్ రాజమోహన్, ఎంపీడీఓ శేఖర్, ఎంపీఓ వినోద్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ ప్రభాకర్, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉట్నూర్ : మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం దివంగత దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రజా పరిషత్ అధ్యక్షులు పంద్ర జైవంత్‌రావు, ఇతర సిబ్బంది నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ లింగయ్య, మండల పరిషత్ అధికారులు హాజరయ్యారు.



శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాల వేస్తున్న అదనపు కలెక్టర్